టి.పి. హేమమాలిని



# స్మృతి వసంతం

మళ్ళీ ఇంకోసారి తనివితీరా ఆ ఇంటిని చూసుకున్నాడు విహారి. ఇంటి ముందున్న బాదం చెట్టుమీద చిలకలు కిలకిల మంటూ పలుకరించాయి.

తినబోతున్న జామకాయను వదిలి తుర్రున పరుగెత్తింది ఉడుత జామచెట్టుపై నుండి విహారిని చూడగానే.

ఇంటి ఆవరణ అంతా పరిమళభరితంగా ఉంది. మల్లె, గులాబి, జాజి, సంపెంగలు వెదజల్లే సౌరభం ఆహ్లాదాన్నిస్తోంది.

''వసంత విహారం'' గోడమీద అందంగా రాసి ఉన్న అక్షరాలు, గోడలకు వెల్ల వేయకపోవడంవలన స్పష్టంగా లేకపోయినా, మసిగుడ్డలో చుట్టిన మాణిక్యంలా ప్రకాశిస్తున్నాయి.

వాటిని పరికించి చూస్తున్న విహారి కళ్ళు అప్రయత్నంగా చెమర్చాయి. తల్లి జ్ఞప్తికి వచ్చింది.

'అసలామెను మరచిపోగలడా తను?' తనలోనే ప్రశ్నించుకున్నాడు. దేవుడు అన్నిచోట్లా ఉండలేక అమ్మని సృష్టించాడంటారు. కానీ తనకి మాత్రం సాక్షాత్తూ ఆ భగవంతుడే అమ్మ అవతారమెత్తాడు.

మరోసారి తృప్తిగా ఇంటిని చూసి బయటకు వచ్చాడు. గతంలో తాముండే కాలనీ అంతా కలియతిరిగాడు. ప్రతీ చోటా తన తల్లి నవ్వుతూ పలకరిస్తున్నట్లు అనుభూతి కమ్మేసింది.

మండే ఎండలు కావడంవలన ఆదిత్యుని ప్రతాపం ఎక్కువగానే ఉంది. అయినా ప్రజాజీవనం సాగిపోతూనే ఉంది.

''తప్పదు మరి. మనుగడకోసం పోరాటం. స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్!'' అల్లంతదూరాన ఏదో కలకలం. దారినపోయే వ్యక్తికి మొహం తిరిగి స్పృహ కోల్పోయాడు. నలుగురైదుగురు సాయంపట్టి దగ్గరలోని చెట్టుకిందకి చేర్చారు. పక్కనే ఉన్న బావిలోంచి నీరుతోడి అతని ముఖంపై చల్లి సేదదీర్చారు.

''ఏ మహాత్ముడి పుణ్యమో తెలీదుకానీ, ప్రాణంలేచొచ్చింది చెట్టుకింద చతికిలబడగానే. మరో వింత చూడండి. ఎంత ఎండలైనా ఎక్కడా నీటి చుక్క లేకపోయినా ఈ బావిలో నిండా నీళ్ళున్నాయి. ఏ మహానుభావుడు తవ్వించాడో. జనం తమలోతాము మాట్లాడుకుంటున్నారు.

ఆ మాటలు విన్న విహారి మనసు రెక్కలొచ్చిన విహంగమై వినువీధిలో విహరించింది.

నిండుగా నవ్వుతున్న తల్లి రూపం కళ్ళముందు కదలాడింది.

''సార్! మీటింగ్‌కి టైమవుతోంది'' అసిస్టెంట్ పిలుపుతో కారువైపు నడిచాడు.

* * *

ఆహూతుల సమక్షంలో విహారికి ఘన సన్మానం జరిగింది. ఎక్కువసేపు ఏడ్చాడనో, అసలెపుడూ నవ్వలేదనో... ఇలాంటి విషయాలకి కూడా సన్మాన సభలు చేసే కోవలోది కాదు ఈ సన్మాన సందడి.

వృక్షశాస్త్రంలో స్నాతకోత్తర పట్టా, పిహెచ్‌డి పూర్తిచేసిన డాక్టర్ విహారి, ఆధునిక పరిశోధనల నిమిత్తం విదేశాలకి పంపబడ్డాడు. అతని పరిశోధనలు ఫలించి తక్కువ సమయంలోనే ఏపుగా పెరిగే చల్లని నీడనిచ్చే వృక్షాలతోపాటు, ఇళ్ళల్లోనే చిన్నచిన్న చెట్లద్వారా ఎక్కువ ఫలసాయం పొందే కూరలు, పళ్ళ వంగడాలు కనిపెట్టబడ్డాయి.

అతని విజ్ఞానానికి మెచ్చి అనేక విదేశీ వర్సిటీలు డాక్టరేట్లను ప్రదానం చేసాయి.

విదేశాలనుంచి తిరిగి రాగానే స్వదేశంలో స్వాగత సత్కారాలు లభించిన తీరు అపూర్వం. తత్ఫలితమే ఈ సన్మానం. గజమాలలతోనూ, శాలువాతోనూ సత్కారం పూర్తయ్యాక సభాసదుల కోరికపై గొంతు సవరించుకున్నాడు.

''అందరికీ వందనాలు! నన్నింతగా ఆకాశానికెత్తేస్తున్నారు మీరంతా. నేను చేసినది చాలా తక్కువ. ఇదంతా నా అదృష్టం. నిజానికి ఈ ఘనత, అదృష్టం మా అమ్మది.

ప్రతి తల్లీ, తండ్రీ తమ బిడ్డలు ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆశిస్తారు. అది వింతేంకాదు. మా అమ్మకూడా అదే ఆశించింది. కానీ నా ఎదుగుదలలో స్వార్థంతోపాటు సామాజిక ప్రయోజనం ఉండాలని కోరుకుంది.

నా తల్లి జ్ఞాపకాలు ఈ సమయంలో మీతో పంచుకోవడం నా ధర్మంగా భావిస్తున్నాను. దయచేసి మీరంతా శ్రమ అనుకోకుండా వినాలని మనవి చేస్తున్నాను.

విహారి నోటివెంట అతని తల్లి వసంత స్మృతులు పరదాలు తీసుకున్నాయి.

* * *

నేను నెలల పసివాడుగా ఉన్నప్పుడే నా తండ్రి దూరమైనాడు. చిన్నవయసులోనే ఎదురైన రాకూడని కష్టాన్ని కూడా దిగమింగుకుని బిడ్డపైనే ఆశలు పెట్టుకుని జీవనాన్ని సాగించింది మా అమ్మ.

మా నాన్నకి ప్రభుత్వోద్యోగం లేకపోవడంతో ఆయన చేసే పని ఆ తర్వాత అమ్మకి దొరకలేదు.

అయితేనేం! స్వశక్తిని నమ్ముకుని మనుగడ సాగించింది. ఆమెకు తెలిసిన కుట్లు, అల్లికలు ఉపయోగించి మాకు ఆహారాన్ని సంపాదించింది. నన్ను బాగా చదివించాలన్న సంకల్పం, ఆమెను రోజులో సగభాగం కుట్టుమిషన్ పైనే కూర్చోబెట్టేది. గుడ్డిలోమెల్ల అన్నట్లుగా నాన్న తరపునుంచి ఒక పెంకుటిల్లు వచ్చింది.

ఆ ఇంటిని కూడా నందనవనం చేసింది. పెరటి నిండా కూరగాయలు పండించింది. అరటిచెట్లు నాటింది.

ఇక పూలమొక్కలైతే, మా ఇంట్లో ఉండే పూవుల సువాసన మా కాలనీ చివరి వరకు వెదజల్లేది.

మా అమ్మది చాలా మంచి మనసు. జాలిగుండె, మాకే బతకడం కష్టంగా ఉండే రోజుల్లోకూడా రోజూ ఒక బిచ్చగాడికో, పేదవాడికో భోజనం పెట్టేది.

సాయంత్రంపూట తనకు తెలిసిన సంగీతంతోపాటు, ట్యూషన్స్ కూడా చెప్పేది.

భారతదేశ ఔన్నత్యాన్ని, మహావీరుల గాథలను చెప్పేది. పుట్టిన ప్రతి మనిషి ఏదో ఒక మంచిపని చేయాలని బోధించేది.

ఇలా కాలం వెళుతుండగా...

* * *

''మీరు, మీ అబ్బాయి తప్పకుండా రావాలి. చాలా గ్రాండ్‌గా ఎరేంజ్ చేసాం ఫంక్షన్'' దర్పాన్ని ప్రదర్శిస్తూ ప్రమీల అందించిన ఇన్విటేషన్ అందుకుంది వసంత.

సరేనన్నట్లు చిరునవ్వుతో తలూపి సాగనంపింది.

''తనెలాగూ మనంత ఘనంగా ఫంక్షన్ చేయలేదు. కనీసం చూసే భాగ్యానికైనా నోచుకోదు. అదో టైప్ మనిషి'' ప్రమీల కావాలనే తనకు వినబడాలని చేసిన కామెంట్స్ వసంత చెవినపడ్డాయి. ఇలాంటివి మామూలే అన్నట్లు పట్టించుకోలేదు.

''అమ్మా!''అంటూ రివ్వున వచ్చిన విహారిని ఆప్యాయంగా హత్తుకుని ''అయ్యాయా ఆటలు?'' అడిగింది.

''రేపు అజయ్ బర్త్‌డేకి పిలవడానికేనా ప్రమీలాంటీ వచ్చింది?'' అడిగాడు. ''అవును నాన్నా! నీకెలా తెలుసు?''

''అజయ్ స్కూల్లో చెప్పాడు. వెళ్దామా మనం?'' ఉత్సాహంగా అడిగాడు.

''సరే!''

* * *

మర్నాడు విహారిని తీసుకుని వెళ్ళింది వసంత అజయ్ బర్త్‌డేకి. అక్కడంతా చాలా కోలాహలంగా ఉంది. పిల్లలే కాదు, పిల్లల పెద్దలు కూడా ఆనందంతో గెంతుతున్నారు.

